క్లుప్తంగా

కేజీబీవీకి ఫ్యాన్‌లు, చార్జింగ్ లైట్లు అందజేత



ఎస్‌ఓకు ఫ్యాన్‌లు అందజేస్తున్న ఎస్సై వెంకటేశ్వరనాయక్

సీఎస్‌పురం (పామూరు): కేజీబీవీ విద్యాలయం విద్యార్థుల సౌకర్యార్థం స్థానిక ఎస్సై ఎం.వెంకటేశ్వరనాయక్ ఫ్యాన్‌లు, చార్జింగ్ లైట్లు అందజేయడం అభినందనీయమని ఎస్‌ఓ షేక్ రేష్మ అన్నారు. స్థానిక పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వరనాయక్ తన సొంత నిధులతో సమకూర్చిన 7 సీలింగ్ ఫ్యాన్‌లు, 10 చార్జింగ్ లైట్లను ఎస్‌ఓ రేష్మకు అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలన్నారు.

ప్రభుత్వ వైద్యశాల తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తహసీల్దార్ షేక్ నాగూల్ మీరా, ఎంపీడీఓ ఎం. రంగసుబ్బరాయుడు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ హాస్పిటల్‌ను తనిఖీ చేశామన్నారు. ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణ రికార్డులు, మందులు తదితర వివరాలు అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వచ్చే రోగులకు అన్ని మందులు ఉన్నాయా లేవా.. అని మెడికల్ అధికారి సందీప్‌ను అడిగారు.

నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉష

పీసీపల్లి: నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధమని, దీనికి రైతులందరూ సహకరించాలని తహసీల్దార్ ఉష అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద ఇర్లపాడులో రైతులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మత్తు పానీయాలకు యువత దూరంగా ఉండాలంటూ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో హనుమంతురావు, ఏవో రంగకృష్ణ, ఉండాలా పిచ్చిరెడ్డి, రామయ్య, శివరామయ్య పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి

మర్రిపూడి: మండలంలోని రైతులు ఎరువుల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేకాధికారి పద్మ సూచించారు. బుధవారం మండలంలోని కూచిపూడి, మర్రిపూడి గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఏఓ వెంకటేష్, తహసీల్దార్ జనార్దన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కే నాగూర్‌వలి, వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు చిరంజీవి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

15లోపు సోక్‌పిట్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

కొండపి: మండలంలో ఈ నెల 15వ తేదీలోపు సోక్‌పిట్ల నిర్మాణాలు పూర్తిచేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి, ఏపీవో వెంకటరావు ఆదేశించారు. కొండపిలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముందుగా వెన్నూరు కొండపిలో నిర్మిస్తున్న సోక్‌పిట్లను తనిఖీ చేసి మండలానికి కేటాయించిన 475 సోక్‌పిట్లను పూర్తి చేయాలని ఏపీవోను ఆదేశించారు. అనంతరం పెట్లూరు పీహెచ్‌సీ, కొండపి సీహెచ్‌సీని తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయులు, ఏపీవో వెంకటరావు, ఏవో మాల్యాద్రి, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ నాగమణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నియంత్రణ పాటించాలి

కొండపి: పొగాకు రైతులు పంట నియంత్రణ పాటించి నాణ్యత పెంపుపై దృష్టి సారించాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ సూచించారు. బుధవారం కొండపి వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్, బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, పోటు మురళీబాబు, నాగినేని భాస్కర్ చౌదరి, రైతులు పాల్గొన్నారు.

పడిపోతున్న లో గ్రేడ్ పొగాకు ధర

- కొనసాగుతున్న బేళ్ల తిరస్కరణ
- ఒక్కరోజే రూ.10 తగ్గిన లో గ్రేడ్ పొగాకు
- 492 బేళ్ల తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో లో గ్రేడ్ పొగాకు ధర రానురానూ దిగజారిపోతోంది. వేలం ప్రారంభంలో పొగాకు కనిష్ట ధర కేజీ రూ.260తో ప్రారంభం కాగా, 12వ రౌండ్ వేలానికి వచ్చేసరికి అది కాస్తా రూ.110కి చేరుకుంది. రౌండ్ రౌండ్‌లో ధరలు పడిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనిష్ట ధర తగ్గిన బేళ్లను కూడా తిరస్కరించడంతో రైతులు ఏం చేయాలో తోచని స్థితిలో ఉన్నారు. బేళ్లను వేలానికి తీసుకురావడానికి ఒక్కో బేలుకు దాదాపు రూ.1,500 ఖర్చవుతోంది. అసలే గిట్టుబాటు ధర లేక అల్లాడుతుంటే ఇంకా అదనపు భారం పడుతోందని వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని, వేలానికి తీసుకొచ్చే అన్ని బేళ్లను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

492 బేళ్ల తిరస్కరణ...

కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 492 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు. కస్టర్ పరిధిలోని జువ్విగుంట, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం, అయ్యవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,141 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 649 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 492 బేళ్లను తిరస్కరించారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.321, కనిష్ట ధర కేజీ రూ.110, సరాసరి ధర కేజీ రూ.201.74గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి



పొన్నలూరు పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి వరలక్ష్మి

పొన్నలూరు: వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి సూచించారు. పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు సింగరబొట్లపాలెం, చౌటపాలెం గ్రామాల్లోని హెల్త్ సెంటర్లను బుధవారం ఆమె సందర్శించారు. వైద్య సేవలు, ఫార్మసీ, లేబొరేటరీ, రోగుల వార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందించే ఆరోగ్య సేవలపై ప్రజలకు నిత్యం అవగాహన కల్పించి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామాల్లోని గర్భిణులకు అవగాహన కల్పించి పీహెచ్‌సీలో కాన్పులయ్యే విధంగా చూడాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన పాటించి పీహెచ్‌సీలో ఓపీల సంఖ్య పెంచాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ సుజాత ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి



నూతన కమిటీ ఇదే..

కనిగిరి రూరల్: కనిగిరి ప్రాంత విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. స్థానిక వైఎస్సార్ రోడ్డులోని డాక్టర్ గురుబ్రహ్మం ధాన్య మందిరంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కమిటీ అధ్యక్షునిగా తమ్మినేని పెద్దిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా జి.నాగభూషణం, ఎం.వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శిగా ఆర్‌ఎంవీఎల్ నరసింహారావు, కోశాధికారిగా ఎం.వెంకటరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే గౌస్ మొహిద్దీన్, ప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణామూర్తిలను ఎన్నుకున్నారు. బి. విశ్వరూపాచారి, జి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాజయ్యల పర్యవేక్షణలో ప్రక్రియ జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడు టి.పెద్దిరెడ్డి మాట్లాడుతూ వెంటనే 12వ పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, గత పీఆర్సీ, డీఆర్ అరియర్లు చెల్లించాలని, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్ తక్షణం చెల్లించాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు 70 సంవత్సరాలు, 75 సంవత్సరాలకు చెల్లించే కమిటేషన్ ఆఫ్ పెన్షన్ 3 శాతాన్ని పునరుద్ధరించాలని, ప్రస్తుతం పెండిగ్‌లో ఉన్న 4 డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలని, సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేలో ఇచ్చే 40 శాతం టికెట్ రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిపో అభివృద్ధికి నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: కనిగిరి డిపో అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ కోరారు. బుధవారం కనిగిరి డిపో పరిశీలనకు వచ్చిన ప్రజా రవాణ శాఖ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారక తిరుమలరావు, నెల్లూరు జోనల్ చైర్మన్ నల్లపురెడ్డి సురేష్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదాయం వచ్చే డిపోల్లో కనిగిరి డిపో ముందంజలో ఉందని.. పురాతనంగా మారిందని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి అధునాతన సౌకర్యాలు, గ్యారేజీ ప్రాంగణంలో సీసీ రోడ్లు, మౌలిక వసతులు కల్పించాలని, కనిగిరి డిపో నుంచి శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆల్ఫా విద్యార్థులకు యూనివర్శిటీ ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కనిగిరి రూరల్: ఆంధ్రకేసరి యూనివర్శిటీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో ఆల్ఫా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బీఎస్సీ మ్యాథ్స్‌లో బత్తుల కళ్యాణి 9.46 మార్కులతో యూనివర్శిటీ ఫస్ట్, బీఎస్సీ బోటనీలో దిరిశనాల గీతా 9.29 మార్కులతో యూనివర్శిటీ ఫస్ట్, బీ వోసీ అగ్రికల్చర్‌లో ముండ్లపాటి రిషికా రాణి 8.67 మార్కులతో యూనివర్శిటీ ఫస్ట్‌లు సాధించారు.

బీవోసీ అగ్రికల్చర్‌లో గుండ్లతోటి హర్షిత 8.31 మార్కులతో యూనివర్శిటీ సెంకడ్, బీఎస్సీ కంప్యూటర్స్‌లో కుంచాల ప్రశాంతి 9.14 మార్కులతో టౌన్ ఫస్ట్ సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు ప్రతిభ చాటిన విద్యార్థులను బుధవారం కళాశాల చైర్మన్ జి.మాలకొండారెడ్డి, ప్రిన్సిపాల్, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టంగుటూరు: విద్యుత్ లైన్లకు మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్ రాయవారిపాలెం పరిధిలోని గ్రామాలైన టంగుటూరు టౌన్, పసుపుకుదురు, రాయవారిపాలెం, అదేవిధంగా 33/11 కేవీ వెలగపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలైన అనంతవరం, ఆలకూరపాడు, వెలగపూడి, తాళ్లపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. 33 కేవీ లైన్లలో ట్రీ కటింగ్ వర్క్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరసన వారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మర్రిపూడి: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ తలపెట్టిన నిరసన వారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బీడీ కిశోర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మండలంలోని ఉపాధ్యాయులందరూ హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. 11న నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలన్నారు. 12న మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమం, 13, 14న ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయడం, 15న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన, 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, ఈ మెయిల్ ద్వారా వినతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పీఆర్‌సీ కమిషన్ ప్రకటించిన వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఉపాధ్యాయ ఉద్యోగాలకు పెండింగ్‌లో ఉన్న డీఏలు మంజూరు చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినూత్న నిరసన తెలియజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పీ హనుమంతరావు, సుబ్బారావు, బ్రహ్మయ్య, రమేష్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

కొండపి: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్, కొండపి నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు సరఫరా చేయాలని సూచించారు. కొండపి, చోడవరం సొసైటీలకు వారంలోపు రైతులకు కావాల్సిన అన్ని ఎరువులు తెప్పించాలని ఆదేశించారు. రైతులతో మాట్లాడి వచ్చే 15 రోజులలో అన్ని రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా స్థానిక పొగాకు బోర్డులో రైతులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏడీఏ నిర్మల కుమారి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయులు, ఏవో మాల్యాద్రి, వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డి

సీఎస్‌పురం (పామూరు): మండలంలో యూరియా కొరత రాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, అదేవిధంగా రైతులు నల్లబర్లీ పొగాకు ఎవరూ సాగు చేయవద్దని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో యూరియాపై ఔట్ రీచ్ కార్యక్రమం, మండల స్థాయి అధికారులతో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకును ఎట్టి పరిస్థితుల్లో రైతులు సాగు చేయవద్దని, ప్రభుత్వం దానిన కొలుగోలు చేయదన్నారు. రైతులు పంటలకు అవసరమైన మేరకు మాత్రమే యూరియా వాడాలని, ఎక్కడా యూరియా కొరత రానీయకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తహసీల్దార్ హుస్సేన్, ఎస్సై ఎం.వెంకటేశ్వర నాయక్, ఏఓ పి.మధుబాబు, సింగిల్‌విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ వెంగయ్య, బొబ్బూరి రమేష్ పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చూడాలి



కో ఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

పామూరు: మండలంలో ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి పి.నారాయణ అన్నారు. మండల స్థాయి అధికారులతో బుధవారం ఆయన కో ఆర్డినేషన్ సమావేశం శాఖల వారీగా సమీక్షించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి పేదలందరికీ పథకాలు అందేలా చూడాలని, బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేయకుండా చూడాలన్నారు. ఎక్కడ యూరియా కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి ఇక్కట్లు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.సుందరరామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, హౌసింగ్ ఏఈ సురేష్, ఏపీఓ మాల్యాద్రి, ఏపీఎం విద్యాసాగర్, ఎంఈఓ కరుణకుమారి పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యానికి చర్యలు చేపట్టాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న పీడీ నారాయణ

పామూరు: మండల కేంద్రం పామూరుతో పాటు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో మెరుగైన పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి పి.నారాయణ అన్నారు. మండల కేంద్రం పామూరుతో పాటు మండలంలోని బొట్లగూడూరు, పలు గ్రామాల్లో బుధవారం ఆయన తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావుతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్యాన్ని పరిశీలించి మెరుగైన పారిశుధ్యం కోసం పలు సూచనలు చేశారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని సూచించారు. ఆర్‌ఎస్‌కే కేంద్రాలను పరిశీలించి యూరియా, ఇతర ఎరువులపై చర్చించారు. తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, డిప్యూటీ ఎంపీడీఓ కె.సుందరరామయ్య, ఏపీఎం విద్యాసాగర్, పీఆర్ జి.అరవిందారెడ్డి, ఏఓ టి.అబ్రహం లింకన్ ఉన్నారు.

అనధికారికంగా పొగాకు బ్యారన్‌లు నిర్మించొద్దు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం కేంద్ర నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో అనధికారికంగా పొగాకు బ్యారన్‌లు నిర్మించరాదని, అలా నిర్మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వేలం కేంద్రం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. వేలం కేంద్రం పరిధిలోని కాకుటూరివారిపాలెం, తూర్పునాయుడుపాలెం గ్రామాల రైతులు బుధవారం 1,017 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 773 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 244 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.322 పలకగా, కనిష్ట ధర రూ.125 పలికింది. సరాసరి ధర రూ.215.97 పలికింది. వేలంలో మొత్తం 40 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



చౌటపాలెంలో మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ ఎస్‌ఈ వరలక్ష్మి

పొన్నలూరు: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని జిల్లా నీటిపారుదల శాఖ ఎస్‌ఈ వరలక్ష్మి సూచించారు. మండలంలోని చౌటపాలెం, సింగరబొట్లపాలెంలోని రైతులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు వ్యవసాయ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసిన పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి రైతులు తమ పంటలకు నానో యూరియా, డీఏపీ వినియోగించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువుల ద్వారా భూసారాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో రాము, వ్యవసాయ సహాయకులు చంద్రిక, సుధీర్, రైతులు పాల్గొన్నారు.

పొన్నలూరులో ఓ మోస్తరు వర్షం



పొన్నలూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షం నీరు

పొన్నలూరు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. పంట పొలాలు, వాగుల్లోకి వర్షం నీరు చేరింది. పొన్నలూరు, ముత్తరాసుపాలెం, వెల్లటూరు, ముప్పాళ్ల, చెరుకూరు, కె.అగ్రహారం గ్రామాల్లో వర్షం పడింది. ఈ వర్షం మెట్ట పైర్ల సాగుతో పాటు ఇటీవల సాగుచేసిన జామాయిల్ పంటకు బాగా ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 0.62 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వర్షం.!



సింగరాయకొండలో ఆకాశం మేఘావృతమైన దృశ్యం



సాయంత్రం వర్షం కురుస్తున్న దృశ్యం

సింగరాయకొండ:

మండలంలో బుధవారం వాతావరణ పరిస్థితులు విచిత్రంగా ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండుటెండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండాకాలాన్ని తలపించే విధంగా సుమారు 40 డిగ్రీల వరకు ఎండ కాసింది. కానీ, సాయంత్రం 5 గంటలయ్యేసరికి ఒక్కసారిగా ఆకాశం కారుమబ్బులతో నిండిపోయి సుమారు గంటసేపు వర్షం కురిసింది. దీంతో సాయంత్రం 5 నుంచి 7.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ ఏఈ సాంబశివరావు మాట్లాడుతూ మండల కేంద్రంలోని మినీ బైపాస్ రోడ్డులో 3 చెట్లు పడిపోవటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, చెట్లు తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని వివరించారు.